ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
గురువారం 6 నవంబరు 2025



మార్చి 18 నుంచి ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షలు

బెంగళూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షలు 2026 మార్చి 18న ప్రారంభం కానున్నాయి. ఈమేరకు రాష్ట్ర ఎస్‌ఎస్‌ఎల్‌సీ బోర్డు ప్రకటించింది. 18న బుధవారం ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష ఉండనుంది. 23న కోర్ సబ్జెక్టులు సైన్స్‌తోపాటు పొలిటికల్ సైన్స్, హిందూస్తానీ సంగీతం, కర్ణాటక సంగీతం ఉంటాయి. 25న సెకండ్ లాంగ్వేజ్, 28న మ్యాథ్స్, సోషియాలజీ, 30న థర్డ్ లాంగ్వేజ్‌తోపాటు ఏప్రిల్ 1న జూనియర్ టెక్నికల్ స్కూల్స్‌కు సంబంధించిన పరీక్షలు ఉంటాయి. ఏప్రిల్ 2న గురువారం సోషల్‌సైన్స్ పరీక్షలు ఉండనున్నాయి.

అహిందలో నాకు కుడిభుజం మేటి

- క్రమశిక్షణ కల్గిన నేతను కోల్పోయాం: సీఎం
- బాగల్కోటె జిల్లా తిమ్మాపురలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

బెంగళూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అట్టడుగు వర్గాలను ఏకం చేసేందుకు అహింద సంఘాన్ని ప్రారంభించిన తరుణంలో నాకు కుడిభుజంలా హెచ్‌వై మేటి వ్యవహరించారని సీఎం సిద్దరామయ్య అన్నారు. బాగల్కోటె జిల్లా తిమ్మాపురలో ఎమ్మెల్యే హెచ్‌వై మేటి అంత్యక్రియలు బుధవారం అధికార లాంఛనాలతో నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తుదిశ్వాస వీడిన హెచ్‌వై మేటి పార్థివదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. స్థానికులు, అభిమానుల సందర్శనకోసం ఉంచారు. పెద్ద ఎత్తున ప్రజలు మేటి పార్థివదేహాన్ని సందర్శించి అంతిమ నివాళులు అర్పించారు. అంత్యక్రియలలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ 1983 నుంచి మేటితో నాకు సత్సంబంధాలు ఉన్నాయన్నారు. క్రమశిక్షణ కల్గిన రాజకీయ నేత అన్నారు. నాకంటే ఓ ఏడాది చిన్నవాడైనా ప్రత్యేక అభిమానం చూపేవారన్నారు. 1996లో బాగల్కోటె ఎంపీ టిక్కెట్ కేటాయించారన్నారు. నేను సూచించానని మంత్రి పదవికి రాజీనామా చేసి ఎంపీగా పోటీచేసి గెలుపొందారన్నారు. దేవెగౌడ ప్రధానమంత్రి అయ్యేందుకు మేటి కూడా కారకుడన్నారు. బాగల్కోటెలో అత్యంత అభిమానం పొందిన ప్రజాసేవకుడన్నారు. జననం, మరణం ఆకస్మికమని, అయితే ఓ ఆప్తుడిని కోల్పోయాననే బాధ ఉందన్నారు. మరో మేటి పుట్టడం అసాధ్యమన్నారు.

● హెచ్‌వై మేటి అంత్యక్రియలు అతడి తల్లిదండ్రుల సమాధి పక్కనే నెరవేర్చారు. కురుబ కులస్తుల సంప్రదాయానికి అనుగుణంగా అంత్యక్రియలు జరిపారు. మేటికి భార్య, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు అంత్యక్రియలను జరిపించారు. మంత్రులు ఎంబీ పాటిల్, సతీశ్‌జార్కిహొళి, మహదేవప్ప, బైరతి సురేశ్, సీఎం తనయుడు యతీంద్రతోపాటు స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని కప్పుతున్న పోలీసులు



నివాళి అర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య



పెద్దసంఖ్యలో పాల్గొన్న అభిమానులు



గౌరవ లాంఛనాలతో..

బ్రెయిన్ స్ట్రోక్ పట్ల నిర్లక్ష్యం వద్దు
● డాక్టర్ బసారెడ్డి 9

ముగ్గురు పోలీసుల సస్పెన్షన్
● పశ్చిమ బెంగాల్ మహిళను హింసించిన ఘటనలో.. 7



నిరసనలో పాల్గొన్న బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు

విస్తరించిన అన్నదాత పోరు

- చెరకుకు గిట్టుబాటు ప్రకటించాల్సిందే
- పుట్టిన రోజున నిరసన శిబిరంలోనే విజయేంద్ర

బెంగళూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చెరకుకు గిట్టుబాటు ధర కల్పించాలని బెళగావి జిల్లాలో ప్రారంభమైన అన్నదాత పోరు ఐదు జిల్లాలకు విస్తరించింది. మహారాష్ట్ర తరహాలో క్వింటాల్‌కు రూ.3,500 ధర నిర్ణయించాలని రైతులు పట్టుబట్టారు. రైతులకు బీజేపీ, జేడీఎస్ పార్టీలు మద్దతు ఇవ్వడంతో ఆందోళన మరింత తీవ్రరూపం దాల్చింది. రెండు రోజులుగా రైతులతోపాటు శిబిరంలో ఉన్న బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర బుధవారం బర్త్‌డే వేడుకలు జరుపుకునేది లేదని ప్రకటించి రైతులతోపాటు కూర్చున్నారు. బెళగావి జిల్లా మూడలగి తాలూకా గుల్లాపుర క్రాస్ వద్ద నిప్పాణి-ముథోళ రాష్ట్ర రహదారి బంద్ చేసిన ఆరోరోజు కూడా ఆందోళన కొనసాగింది. బెళగావి, బాగల్కోటె, విజయపుర, కలబురగి జిల్లాల్లోనూ నిరసనలు కొనసాగాయి. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని పరిహారం విషయంలో స్పందించాలని, లేనిపక్షంలో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బెళగావి ఎంపీ జగదీశ్‌శెట్టర్‌తోపాటు పలువురు నాయకులు రైతుల ఆందోళనకు మద్దతు పలికారు. కలబురగి జిల్లా అఫ్జల్‌పుర రైతులు హిరేబాగేవాడిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. యమకనమరడి వద్ద ఎడ్లబండ్లతో నిరసనకు దిగారు. రైతుసేవాకేంద్రంతోపాటు దుకాణాలు మూసివేసి వ్యాపారులు మద్దతు ఇచ్చారు. న్యాయవాదులు విధులను బహిష్కరించి అన్నదాతలతో కలసి ఆందోళనలో పాల్గొన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే గురువారం జాతీయ రహదారిని దిగ్బంధించి, పంజాబ్ తరహాలో అన్నదాతల సత్తా ఏంటో చూపుతామని రైతుసంఘం అధ్యక్షుడు చూనప్ప పూజారి వెల్లడించారు. పొరుగున ఉన్న మహారాష్ట్రలో ఇప్పటికే క్వింటాల్‌కు రూ.3,400 నుంచి రూ. 3,500 దాకా ధర చెల్లిస్తున్నారని, కానీ కర్ణాటకలో ధర నిర్ణయించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లలో రూ.4వేల దాకా గిట్టుబాటుధర ఉందని, అయినా రాష్ట్రంలో మాత్రం రైతుకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహించారు. రాష్ట్రంలో 79 చక్కెర ఫ్యాక్టరీలు ఉన్నాయి. అందులో బెళగావి జిల్లాలోనే 28 ఉన్నాయి. బాగల్కోటెలో 11 చక్కెర ఫ్యాక్టరీలు ఉండగా మిగిలిన ఫ్యాక్టరీలు రాష్ట్రమంతటా ఉన్నాయి. ప్రభుత్వానికి చక్కెర ఫ్యాక్టరీల నుంచి 50వేలకోట్లకుపైగా పన్ను రూపంలో జమ అవుతోందన్నారు. రైతులు ఆందోళన చేయడం వెనుక ప్రధాన కారణం చక్కెర ధర పెరిగినా చెరకుకు మాత్రం యథావిధిగా చెల్లించాలనే ఫ్యాక్టరీ యజమానుల నిర్లక్ష్యమే కారణమన్నారు. గత ఏడాది మార్కెట్‌లో చక్కెర కిలో రూ.30 ఉండేదన్నారు. ప్రస్తుతం టన్ను చెరకు రూ.3వేలకు నిర్ణయించారన్నారు. మార్కెట్‌లో చక్కెర కిలో రూ.42-45 దాకా ఉందన్నారు. అందుకు అనుగుణంగా టన్ను చెరకుకు రూ.3500 చెల్లించాలని డిమాండ్ చేశారు. చక్కెరశాఖ మంత్రి శివానంద పాటిల్ నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. చెరకుకు గిట్టుబాటుధర నిర్ణయించేది కేంద్రప్రభుత్వమని సీఎం సిద్దరామయ్య తెలిపారు. కోలారులో మంగళవారం మీడియాతో మాట్లాడినవేళ చెరకు ధర పెంచాలని బెళగావి, బాగల్కోటె జిల్లాల్లో ఆందోళన చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చిందన్నారు. కేంద్రప్రభుత్వం వెంటనే స్పందించాల్సి ఉందన్నారు.

● కాగా చెరకుకు గిట్టుబాటు ధర లభించలేదని క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన రైతు లక్కప్ప గుండదాళను ఆసుపత్రిలో బీజేపీ నేతలు పరామర్శించారు. బుధవారం సాయంత్రం బీజేపీ అధ్యక్షుడు విజయేంద్రతోపాటు పలువురు ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బాధిత రైతును పరామర్శించారు.

● చెరువులకు నీరు మళ్లించాలని చామరాజనగరలో బీజేపీ నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. గుండ్లుపేట తాలూకాలో రైతులు కొనసాగిస్తున్న నిరసనకు ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామి మద్దతు ఇచ్చారు. బుధవారం రైతులతో కలసి గుండ్లుపేటలో ర్యాలీలో పాల్గొన్నారు. ఎంపీ యదువీర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. చెరువులకు నీరు మళ్లించే విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని మండిపడ్డారు.



చామరాజనగర జిల్లా గుండ్లుపేట తాలూకా ర్యాలీలో ప్రతిపక్ష నేతలు, ఎంపీ

9న మేలుకోటెకు ఉపరాష్ట్రపతి రాక



సీపీ రాధాకృష్ణన్

బెంగళూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండ్య జిల్లాలో వెలసిన ప్రముఖ దేవాలయం మేలుకోటె చలువరాయస్వామి ఆలయాన్ని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ 9వ తేదీన సందర్శించనున్నారు. మండ్య జిల్లాధికారి డాక్టర్ కుమార్ బుధవారం జిల్లాస్థాయి అధికారులతో ప్రత్యేక సమీక్ష జరిపారు. ఉపరాష్ట్రపతి జిల్లాలో తొలిసారి పర్యటిస్తున్నారని ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిరంతరాయంగా విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా స్వచ్ఛంగా ఉంచాలని సూచించారు. ప్రొటోకాల్‌కు అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రత్యేకించి హెలిప్యాడ్ ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. పాండవపుర సబ్‌డివిజన్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, తహసీల్దార్ బసవరెడ్డెప్పతోపాటు వివిధ శాఖల అధికారులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మహాలక్ష్మి లే అవుట్‌లోని గణేశ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆలయాల్లో దీపోత్సవం

బెంగళూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం పలు ఆలయాలలో విశేషపూజలు, అలంకరణలు చేశారు. సాయంత్రం ప్రత్యేకించి శివాలయాలలో అధికంగా దీపోత్సవం నిర్వహించారు. పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా దీపాలు వెలిగించారు.

10 నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు



అనంతపురం విద్య, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి ఎస్‌ఏ-1 పరీక్షలు ఈనెల 10వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు తెలిపారు. ఆ వివరాలను ఆయన బుధవారం వెల్లడించారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు 1 నుంచి 5వ తరగతుల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఇప్పటికే ప్రశ్నాపత్రాలు 6నుంచి 10వరకు ఎమ్మార్సీలకు, 1నుంచి 5 తరగతుల వరకు క్లస్టర్ల కాంప్లెక్స్‌లకు సరఫరా చేశామన్నారు. ఈనెల25 నాటికి మూల్యాంకనం పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.

పుదుచ్చేరి, ఆంధ్రా మ్యాచ్ డ్రా



ఆంధ్రా కెప్టెన్ హేమంత్‌రెడ్డికి మెమెంటో అందజేస్తున్న భీమలింగారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి, ఆంధ్రా అండర్-23 జట్ల మధ్య సీకే నాయుడు క్రికెట్ టోర్నీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. స్థానిక అనంతపురం క్రీడామైదానంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో బుధవారం మూడోరోజు పుదుచ్చేరి జట్టు 37-4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో ఆ జట్టు కెప్టెన్ నియాన్ శ్యామ్ కంగయాన్ మరో సెంచరీ (107)తో ఆకట్టుకున్నాడు. ఆకాష్ హాఫ్ సెంచరీ (51) కొట్టాడు. దీంతో పుదుచ్చేరి జట్టు 76.2 ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 214 పరుగులు చేసింది. చివరిరోజు కావడంతో మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. ఆంధ్రా బౌలర్లు కేఎస్‌ఎన్ రాజు 4, సుమిత్, ఆదిత్యరెడ్డి చెరో వికెట్ తీశారు. అంతకుముందు పుదుచ్చేరి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 110.4 ఓవర్లలో 337 పరుగులు చేసింది. ఆంధ్రా జట్టు 341పరుగులకు 9 వికెట్ల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో పుదుచ్చేరి 214 పరుగులు చేసింది. మ్యాచ్ అనంతరం జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి భీమలింగారెడ్డి.. రెఫరీ, అఫీషియల్స్, ఇరు జట్ల కెప్టెన్లకు మొమెంటోలు అందజేశారు.

కీచక టీచర్‌పై లోతుగా దర్యాప్తు

అనంతపురం విద్య, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం వెంకటంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించి సస్పెండైన టీచర్‌పై విద్యాశాఖ ఉన్నతాధికారులు మరింత లోతుగా దర్యాప్తు మొదలు పెట్టారు. ఆ టీచర్ ఎక్కడ పనిచేసినా అంతేనని సమాచారం. గతంలో పనిచేసిన ప్రాంతంలో కూడా ఓ మహిళా టీచర్‌తోపాటు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధించాడని తెలిసింది. అక్కడ హెచ్‌ఎం, ఎంఈఓ, టీచర్లు విషయం కప్పిపెట్టారని జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. ఇలాంటి టీచర్‌ను సస్పెండ్ చేస్తే సరిపోదనీ, అంతకన్నా తీవ్రమైన పనిష్మెంట్ ఇవ్వాల్సిందేనన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆ టీచర్ ఉద్యోగంలో ఎప్పుడు చేరాడు, ఏయే పాఠశాలల్లో పనిచేశాడు, ఈయన సాగించిన కీచక పర్వాల గురించి పూర్తిస్థాయిలో ఆరాతీసి, రాష్ట్ర విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసికెళ్లి మరింత కఠిన చర్యలు తీసుకునేలా చూస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. ఈ లెక్కన ఆ కీచక టీచర్ ఉచ్చుబిగిస్తున్నారని తెలుస్తోంది.

మరింత గడువు ఇవ్వండి

బడి బస్సుల తనిఖీలపై డీటీసీకి అపుస్మా నేతల వినతి



డీటీసీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు స్కూళ్ల సంఘం నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బడి బస్సుల ఫిట్‌నెస్, అర్హత పత్రాల తనిఖీలకు మరింత గడువు ఇవ్వాలని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారికి ప్రైవేటు స్కూళ్ల అసోసియేషన్ (అపుస్మా) నేతలు విజ్ఞప్తి చేశారు. ఆ సంఘం నేతలు కుసుమా పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి, నాయుడు, సూర్యనారాయణరెడ్డి, మధుసూదనరెడ్డి, రవిశంకరప్రసాద్ తదితరులు బుధవారం డీటీసీని కలిశారు. వారు మాట్లాడుతూ.. ఈనెల 10వ తేదీలోగా బడిబస్సులన్నింటినీ తనిఖీ చేయాలనీ, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. రవాణాశాఖ మంత్రిని కలిసి తనిఖీలకు మరింత గడువు ఇవ్వాలని కోరామనీ, అందుకు ఆయన సానుకూలంగా ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో మరింత గడువు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ యువత, కిశోరబాలికల అభివృద్ధి కార్యక్రమం కింద కేంద్ర ఆర్థికసాయం పొందడానికి స్వచ్ఛంద సంస్థ (ఎన్జీఓ)లు ఈనెల 30వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి రవిశంకర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ ఐడీ ఉన్న స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9849909062 నంబరులో సంప్రదించాలని కోరారు. https://youth. yas.gov.in. /scheme/npyad/ngo/login వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ట్రైనింగ్ పోర్టల్‌పై అవగాహన అవసరం

అనంతపురం న్యూటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ పోర్టల్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని డీపీఆర్‌సీ ట్రైనింగ్ మేనేజర్ నిర్మల్‌దాస్ సూచించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండలం నుంచి జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, కంప్యూటర్ ఆపరేటర్లకు ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ పోర్టల్, ఈ ప్రగతి యాప్‌పై స్థానిక డీపీఆర్‌సీ సమావేశ భవనంలో శిక్షణ ఇచ్చారు. డీపీఆర్‌సీ ట్రైనింగ్ మేనేజర్ నిర్మల్‌దాస్, డీపీఓ కార్యాలయ డీపీఎం అబ్దుల్ శిక్షణ ఇచ్చారు. సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

శిక్షణకు జడ్పీ డిప్యూటీ సీఈఓ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య.. డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఇండక్షన్ శిక్షణకు 15 రోజుల పాటు విజయవాడకు వెళ్లారు. నూతనంగా డీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి 30 రోజులపాటు శిక్షణ ఉంటుంది. ఇప్పటికే మొదటి విడతలో డీడీఓ నాగశివలీల అక్టోబరు 5 నుంచి 19వతేదీ వరకు నిర్వహించిన శిక్షణకు హాజరయ్యారు. ఉద్యోగోన్నతి పొంది డిప్యూటీ సీఈఓలు, ఏపీడీలుగా ఉన్న వారికి బుధవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఆ మేరకు డిప్యూటీ సీఈఓ శిక్షణకు హాజరుకానున్నారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

పంచాయతీ కార్మికుల ధర్నా

అనంతపురం న్యూటౌన్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ పంచాయతీ కార్మిక సంఘం నాయకులు.. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పంచాయతీ కార్యాలయం (డీపీఓ) ముందు ధర్నా చేపట్టారు. అంతకుముందు రుద్రంపేట సర్కిల్ నుంచి కార్మికులు ర్యాలీగా డీపీఓ కార్యాలయం వరకు చేరుకుని, అక్కడ ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అనంతపురం రూరల్ పంచాయతీలో కార్మికులకు మూడు నెలలుగా వేతనం అందడం లేదన్నారు. దీంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించి, ఆదుకోవాలని కోరారు. అనంతరం ఏఓ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాషా, గౌరవాధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణ పాల్గొన్నారు.

ఎన్నేళ్లో ఎంజాయ్‌మెంట్..!

కమ్మర కులస్థుల భూమిలో వైసీపీ నాయకుల పాగా

బ్రిటిష్ పాలనలో 24.44 ఎకరాలు కేటాయింపు

డైక్లాట్, ఆర్‌హెచ్‌లలో కమ్మర కులస్థుల పేరు

అన్నదమ్ముల వివాదంతో వెలుగులోకి..



వైసీపీ నేతలు సాగు చేస్తున్న కమ్మర కులస్థుల ఇనామ్ భూమి

కూడేరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లిపల్లి గ్రామంలో బ్రిటిష్ పాలనా కాలం నుంచి ఓ భూమికి సంబంధించి పేరు ఒకరిది.. పెత్తనం మాత్రం మరొకరిదిగా సాగుతోంది. తమ పేరుమీద ఉన్న భూమి కోసం వారు ఎంత పోరాటం చేసినా వృథానే అయ్యింది. ఆ భూమిని సాగు చేసుకుంటున్న వారు రాజకీయ పలుకుబడితో అసలు హక్కుదారులను అణచివేస్తున్నారు. తాజాగా ఆ భూమిని సాగు చేస్తున్న అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి నిజానిజాలు నిగ్గుతేల్చే పనిలో పడ్డారు.

విలువైన భూమి కావడంతోనే...

జల్లిపల్లి గ్రామ సమీపంలో కమ్మర కులస్థులకు కేటాయించిన సర్వే నెంబరు 486లోని 24.44 ఎకరాల భూమి ప్రస్తుత ధరల మేరకు రూ. కోట్లు విలువ చేస్తోంది. ఆ భూమి అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారికి పక్కనే ఉంది. ప్రస్తుతమున్న మార్కెట్ విలువ ప్రకారం ఆ ప్రాంతంలో ఎకరా రూ. 50 లక్షలపైమాటే నడుస్తోంది. ఆ క్రమంలోనే వైసీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి సాగు చేస్తున్న పొలం విషయంలో అన్నదమ్ముల మధ్య వివాదం రాజుకుంది. భూమి వాటాల్లో తేడాలు రావడంతో వివాదం రెవెన్యూ అధికారుల చెంతకు చేరింది. ఆ సమయంలో సర్వే నెంబర్లు, డైక్లాట్, ఆర్‌హెచ్‌ను అధికారులు పరిశీలించారు. దీంతో అసలు విషయం బయటికి వచ్చింది. ఆ భూమి బ్రిటిష్ కాలంలోనే కమ్మర కులస్థులకు కేటాయించారని, మీరెందుకు సాగులో ఉన్నారని... మీకేమైనా కమ్మర కులస్థులు అమ్మారా..? కొనుగోలు చేసి ఉంటే వాటికి సంబంధించి డాక్యుమెంట్లు ఇవ్వాలని అధికారులు కోరారు. పలుమార్లు అధికారులు ఆరాతీసినా.. రామచంద్రారెడ్డి, కుటుంబసభ్యులు, ఆ భూమిలో సాగులో ఉన్న మరికొంత మంది నుంచి ఎటువంటి రికార్డులు అధికారులకు ఇవ్వలేదని సమాచారం.

బ్రిటిష్ కాలంలోనే కేటాయింపు

బ్రిటిష్ వారి పాలనలో జల్లిపల్లి గ్రామంలో కమ్మర కులస్థులకు సర్వే నెంబర్ 486లో 24.44 ఎకరాలు, సర్వే నెంబర్ 489లో 4.71 ఎకరాలు కేటాయించారు. వారి పేరు మీద అప్పట్లోనే డైక్లాట్‌లో పొందుపరిచారు. అయితే ఎలా జరిగిందో కాని సాగులో మాత్రం వైసీపీకి చెందిన కొందరు నాయకులు, వారి బంధు, మిత్రవర్గం ఉన్నారు. గత కొన్నేళ్లుగా కమ్మర కులస్థులు ఆ భూమి కోసం పోరాటం చేసినట్లు సమాచారం. ఆ భూమిలో అధిక శాతం అగ్రవర్ణాలకు చెందిన వారు ఉండటం, గత ప్రభుత్వాలు వారికి అండగా నిలవడంతో కమ్మర కులస్థులను భయపెట్టినట్లు సమాచారం. అధికారులు చెబుతున్న మేరకు... రైతువారి పట్టా పొంది ఉండి, క్రయ విక్రయాలు జరిపి ఉంటే ఆ భూమి సాగులో ఉన్న వారిదే అవుతుందని చెప్పుకొస్తున్నారు. అలా జరగకపోయి ఉంటే ఆ భూమి కమ్మర కులస్థులకే చెందుతుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

రికార్డులు తారుమారు

కమ్మర కులస్థులకు కేటాయించిన 24.44 ఎకరాలకు సంబంధించిన అన్ని రికార్డులు సాగుదారులు తమ పేరు మీద నమోదు చేసుకున్నారు. అప్పట్లో కొందరు రెవెన్యూ అధికారులు వీరికి సహకరించడంతో పాసుబుక్కులు, 1బీ అడంగల్ సృష్టించారు. డైక్లాట్‌లో కమ్మర కులస్థుల పేరుమీద భూమి ఉందని తెలిసినా... రెవెన్యూ అధికారుల సహకారం, రాజకీయ పలుకుబడితో మొత్తం భూమిని తమ ఆధీనంలో ఉంచుకున్నారు. పైగా ఇనామ్ భూమి పట్టాలు సృష్టించుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సర్వే నంబర్ 486లో గోపాల్ రెడ్డి 1.21 ఎకరాలు, భూపతిరెడ్డి 4.07 ఎకరాలు, సుంకు కేదర్‌నాథ్ 2.85 ఎకరాలు, బిరెడ్డి మహేష్ రెడ్డి 2.04 ఎకరాలు, బైరెడ్డి వరలక్ష్మి 4.08 ఎకరాలు, బైరెడ్డి నాగలక్ష్మి 4.07 ఎకరాలు, బొజ్జే నందిని 2.03 ఎకరాలు, రామకుమార్ రెడ్డి 4.08 ఎకరాలు చొప్పున ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. భూమికి సంబంధించి ప్రభుత్వ పథకాలు కూడా అందుతుండటంతో ఎవరికీ ఆ భూమిపై అనుమానం రాలేదు. మరోవైపు వైసీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఆయన తమ్ముడు లక్ష్మీనారాయణరెడ్డితో పాటు మరికొందరు తమ భార్యల పేర్లు, కుమారులు, కుమార్తెల పేర్ల మీద రిజిస్ట్రేషన్‌లు చేయించారు. లింకు డాక్యుమెంట్ కోసం ఈ తతంగమంతా నడిపించినట్లు రెవెన్యూ రికార్డులను బట్టే స్పష్టంగా అర్థమవుతోంది.

డైక్లాట్‌లో కమ్మర పేరు మీదే ఉంది



కూడేరు మండలం ఉదిరిపికొండ రెవెన్యూ పరిధిలోని జల్లిపల్లి గ్రామ సమీపంలో ఉన్న సర్వే నెంబర్ 486లోని 24.44 ఎకరాల భూమి డైక్లాట్‌లో కమ్మర ఇనామ్‌గా ఉంది. అయితే ప్రస్తుతం ఆ భూముల్లో వేరొకరు సాగులో ఉన్నారు. ఈ సర్వే నంబరుకు రైతువారి పట్టా కేటాయించి ఉంటే విక్రయించే అవకాశం ఉంటుంది. రైతువారి పట్టా కేటాయించకపోతే అది కమ్మర కులస్థులకే చెందుతుంది. ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

-మహబూబ్ బాషా, ఇన్‌చార్జ్ తహసీల్దార్, కూడేరు

చిలమత్తూరులో ఏసీబీ

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు

కొంత నగదు స్వాధీనం.. రికార్డుల పరిశీలన



తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

హిందూపురం, చిలమత్తూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఏసీబీ అనంతపురం జిల్లా కార్యాలయ ఇన్‌స్పెక్టర్ జయమ్మ ఆధ్వర్యంలో 9 మంది సిబ్బంది తనిఖీలు చేపట్టారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి పెరిగిపోయిందని ఇటీవల ఆరోపణలు వస్తున్నాయి. అయితే, కార్యాలయంలో అవినీతి జరుగుతున్నట్లు తమకు ఫిర్యాదు అందలేదని, ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు చేపట్టామని ఇన్‌స్పెక్టర్ జయమ్మ తెలిపారు. ఏసీబీ అధికారులు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కార్యాలయంలోకి ప్రవేశించి, తలుపులు మూసేశారు. కార్యాలయం లోపల ఉన్న సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్, ఇతర ఉద్యోగుల నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయం లోపల ఉన్న ప్రైవేటు వ్యక్తులు, విలేకరులు, రిజిస్ట్రేషన్, ఇతర పనుల మీద వచ్చినవారిని బయటకు వెళ్లనివ్వలేదు. 'ఎందుకు వచ్చారు? రిజిస్ట్రేషన్లు చేయించారా? అదనంగా డబ్బులు చెల్లించారా..?' అని వారిని ప్రశ్నించారు. కార్యాలయంలో జరిగే అవినీతి కార్యకలాపాల సమాచారాన్ని రాబట్టే ప్రయత్నం చేశారు. ఆ తరువాత కార్యాలయంలో పనిచేసే ప్రైవేటు వ్యక్తులు, దస్తావేజు లేఖరులు మినహా.. మిగిలినవారిని పంపించేశారు. అనంతరం రికార్డుల తనిఖీ ప్రారంభించారు. ఇటీవల జరిగిన రిజిస్ట్రేషన్లు, జారీ చేసిన ఈసీలు, నకళ్లు, ఇతర లావాదేవీల వివరాలను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ చలానాలను పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్, ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులు, దస్తావేజు లేఖరుల ఫోన్ పే లావాదేవీలను పరిశీలించినట్లు సమాచారం. ఏసీబీ సీఐ హమీద్‌ఖాన్ సాయంత్రం చేరుకుని, తనిఖీలలో పాలుపంచుకున్నారు. కార్యాలయంలో కొంత నగదు పట్టుబడినట్లు విశ్వసనీయ సమాచారం. తనిఖీలు గురువారం కూడా కొనసాగుతాయని, అప్పటి వరకు పూర్తి సమాచారం చెప్పలేమని సీఈబీ అధికారులు అన్నారు.

రైల్వే ట్రాక్ పరిశీలన

గుంతకల్లు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్ పరిధిలోని గుంతకల్లు-క్రిష్ణా సెక్షన్‌లో డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా బుధవారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేక రైలులో బయలుదేరిన డీఆర్‌ఎం రీర్ విండో ద్వారా ట్రాక్‌ను పరిశీలించారు. బలహీనపడిన, అభివృద్ధి చేయాల్సిన ప్రదేశాలను డీఆర్‌ఎం, ఆయన వెంట వెళ్లిన సాంకేతిక సిబ్బంది గుర్తించారు.

పడిపోతున్నట్లు నటించి.. డబ్బు కాజేశారు..

ఏడు నెలల తర్వాత ముగ్గురు నిందితుల అరెస్టు

బత్తలపల్లి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో పడిపోతున్నట్లు నటించి ఓ వ్యక్తి నుంచి డబ్బు కాజేసిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు ఏడు నెలల తర్వాత అరెస్టు చేశారు. చిత్తూరు నగరంలోని స్టాలిన్ నగర్‌కు చెందిన మేకల లోకేశ్, తోట రాకేష్, తోట ఇమ్మాన్యుయల్‌ను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ హేమంత్‌కుమార్ బుధవారం వెల్లడించారు. చిత్తూరులోని లెనిన్ నగర్‌కు చెందిన నిందితులు ముగ్గురు ముఠాగా ఏర్పడ్డారు. మోసాల ద్వారా డబ్బు సంపాదించాలనుకున్నారు. అందులో భాగంగా బత్తలపల్లిలోని విజయనగర్ కాలనీకి చెందిన అయ్యప్ప ఈ ఏడాది మార్చి 8వ తేదీన ధర్మవరం రోడ్డులోని ధర్మేంద్రరెడ్డి ఎలక్ట్రికల్ షాపు వద్ద నిలబడి ఉండగా.. మేకల లోకేశ్ తొలుత ద్విచక్రవాహనంలో వచ్చాడు. అయ్యప్ప సమీపంలో ద్విచక్రవాహనం పడిపోతున్నట్లు నటిస్తూ.. సాయం కోరాడు. దానిని నమ్మిన అయ్యప్ప.. లోకేశ్‌కు సాయం చేసేందుకు వెళ్లాడు. అంతలోనే రాకేష్, ఇమ్మాన్యుయేల్ మరో బైక్‌లో వచ్చారు. సాయం చేస్తున్నట్లు నటించారు. ఆ సమయంలో అయ్యప్పను ఏమార్చి అతడి జేబులోని మొబైల్‌ను అపహరించారు. ఫోన్ పే ద్వారా అతడి ఖాతాలోని రూ.1.82 లక్షల సొమ్మును బదిలీ చేసుకున్నారు. తర్వాత మొబైల్ చోరీ అయిందంటూ అయ్యప్ప.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా మేకల లోకేశ్, తోట రాకేష్, తోట ఇమ్మాన్యుయేల్‌ను బత్తలపల్లిలోని ఆర్యన్ ధాబా వద్ద అరెస్టు చేశారు. ఉనయోగించిన బైక్, రూ.70 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ సోమశేఖర్ పాల్గొన్నారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

పంట అమ్మిన సొమ్ము కాజేశారు

- రైతు ఖాతా నుంచి రూ.2.92 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించగా.. వచ్చిన సొమ్మును సైబర్ నేరగాళ్లు కాజేశారు. రైతు ఖాతాలో నగదును మాయం చేశారు. మండలంలోని పాలవెంకటాపురం గ్రామానికి చెందిన రైతు దాసరి నాగార్జున తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇటీవల మూడెకరాల్లో టమోటా సాగు చేశాడు. దిగుబడి విక్రయించగా.. వ్యాపారులు.. రైతు ఖాతాకు రూ.2.92 లక్షలు జమ చేశారు. ఆ సొమ్మును వేరుశనగ పంట సాగు పెట్టుబడి కోసం ఖాతాలోని ఉంచుకున్నాడు. ఈ క్రమంలో ఈనెల 4న రైతు ఖాతా నుంచి రూ.2.92 లక్షల నగదు డెబిట్ అయినట్లు మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. రైతు నాగార్జున అప్రమత్తమై బ్యాంకు స్టేట్‌మెంట్ తీసుకున్నాడు. అందులో సొమ్ము వేరే ఖాతాకు బదిలీ అయినట్లు తేలడంతో రైతు ఖంగుతిన్నాడు. వెంటనే అనంతపురం సైబర్ క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం కళ్యాణదుర్గం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పంట అమ్మిన సొమ్ము సైబర్ నేరగాళ్లు దోచుకోవడంతో రైతు లబోదిబోమంటున్నాడు.

రైల్వే గేట్ తాత్కాలిక మూసివేత

గుత్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని కర్నూలు రోడ్డులో ఉన్న రైల్వేగేట్‌ను బుధవారం నుంచి మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ట్రాక్ మరమ్మతుల కారణంగా రైల్వే గేట్‌ను మూసివేస్తున్నామన్నారు.

యువకుడి మృతి

బొమ్మనహాళ్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన తారమ్మ, నబీరసూల్ కుమారుడు అజీముద్దీన్ (26) ద్విచక్రవాహనంలో బళ్లారికి బుధవారం బయలుదేరాడు. బళ్లారి సమీపంలోని చెరకుంట గ్రామ సమీపంలో మలుపు వద్ద బైక్ అదుపుతప్పడంతో అతను కిందపడి అక్కడికక్కడే మరణించాడు. బళ్లారి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు హాకీ వందేళ్ల వేడుకలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడ హాకీ వందేళ్ల వేడుకలు ఈనెల 7వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు హాకీ అనంతపురం ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. హాకీ వందేళ్ల వేడుకల నిర్వహణపై చర్చించారు. నగరంలో మొదట ర్యాలీ, అనంతరం సీనియర్, ఉత్తమ క్రీడాకారులకు సన్మానం చేయనున్నట్లు సభ్యులు తెలిపారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు విజయబాబు, ఉపాధ్యక్షుడు మహేష్, కోశాధికారి హిమబిందు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



గాయత్రి (ఫైల్)

బత్తలపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముస్టూరు గ్రామానికి చెందిన గాయత్రి(21) బుధవారం ఉరి వేసుకున్నారు. భర్త వేధింపులు భరించలేక తమ కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని గాయత్రి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపిన మేరకు, ముస్టూరుకు చెందిన హరిప్రసాద్‌కు కడప జిల్లా సింహాద్రిపురం మండలం నిడివెలగల గ్రామానికి చెందిన నిర్మల, సోమయ్య దంపతుల కూతురు గాయత్రితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. హరిప్రసాద్ కూలి పనులు చేస్తుంటాడు. ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో అవసరానికి గాయత్రి తల్లిదండ్రులు సాయం చేసేవారు. కానీ ఆ డబ్బుతో హరిప్రసాద్ మద్యం సేవించి, భార్యను ఇబ్బంది పెట్టేవాడు. భర్త వేధింపులు భరింలేకున్నానని, ఇక బతకనని గాయత్రి తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేశారు. వారు సర్ది చెప్పారు. అయినా ఫలితం లేకపోయింది. గాయత్రికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య



గోగర్ (ఫైల్)

తాడిపత్రి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ గోగర్ (40) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ సీఐ ఆరోహణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పంజాబ్ రాష్ట్రం పాటియాలా పట్టణానికి చెందిన గోగర్ ఏడాది క్రితం బ్యాంకు మేనేజర్‌గా తాడిపత్రికి వచ్చారు. పట్టణంలోని మెయిన్ బజారు సమీపంలో గది అద్దెకు తీసుకున్నారు. అతడి భార్య కూడా బ్యాంకు ఉద్యోగి. కొంతకాలంగా ఇరువురి మధ్య మనస్పర్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారంరోజుల క్రితం భార్య విడాకుల నోటీసు పంపింది. దీంతో తీవ్ర మనోవేదనకు లోనైన గోగర్ తనకు బతకాలని లేదని తోటి ఉద్యోగులతో చెబుతుండేవాడు. ఈ నేపథ్యంలోనే తీవ్ర మనస్తాపం చెంది బుధవారం తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని, మరణించాడు. బ్యాంకుకు రాకపోవడంతో సిబ్బంది మెసేజ్ పెట్టారు. అయినా స్పందన లేకపోవడంతో గది వద్దకెళ్లారు. తలుపు తీయకపోవడంతో కిటికీ తెరిచి చూడగా.. ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. గోగర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు చెప్పారు.

మహిళ హత్య కేసులో మరొకరి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రెడ్డప్ప

ధర్మవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళ హత్య కేసులో పరారీలో ఉన్న నిందితుడిని టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను స్థానిక స్టేషన్‌లో బుధవారం సీఐ రెడ్డప్ప వెల్లడించారు. చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన సాకే వెంకటరాముడు ధర్మవరం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో భార్య సరస్వతితో కలిసి నివాసం ఉండేవాడు. సరస్వతిపై అనుమానం పెంచుకున్నాడు. ఆమెను హతమార్చాలనుకున్నాడు. తన అక్క చిట్టెమ్మ, ఆమె భర్త రామంజనేయులు, మరో అక్క వెంకటలక్ష్మి, వదిన రామాంజినమ్మ సాయంతో సరస్వతిని ఈ ఏడాది సెప్టెంబరులో చంపేసి నరసింహులు, విజయ్ సాయంతో పట్టణ సమీపంలోని గొల్లపల్లి వంకలో పూడ్చిపెట్టారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సరస్వతిని భర్తే చంపేసినట్లు పోలీసులు తేల్చారు. ఏడుగురిపై కేసు నమోదు చేశారు. వారిలో ఆరుగురిని ఇదివరకే అరెస్టు చేశారు. వెంకటరాముడు బావ రామాంజనేయులు తప్పించుకు తిరుగుతుండేవాడు. ఈ నేపథ్యంలో అతడిని ధర్మవరంలోని లక్ష్మీచెన్నకేశవపురం సమీపంలోని పీహెచ్‌సీ వద్ద ఉండగా బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో ఏడుగురినీ అరెస్టు చేశామన్నారు.

పీఎండీడీకేవై కార్యాచరణ సిద్ధం చేయండి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన దీర్ఘకాలిక లక్ష్యాలు-ప్రయోజనాలపై జిల్లా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి, ఆహార భద్రత లక్ష్యంగా జిల్లా కార్యాచరణ ఉండాలని అన్నారు. పంటల వైవిధ్యం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పంటకోత, నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, నీటిపారుదల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, స్వల్ప, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలకు ప్రాధాన్యం, మెరుగైన పాలన, సేవ బట్వాడా వనరుల సద్వినియోగం తదితర అంశాలు ఇందులో భాగం కావాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రామునాయక్, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, భూగర్భ శాఖ అధికారి రాజశేఖర్, పశుసంవర్ధక అధికారి శుభదాసు, ఇరిగేషన్ అధికారి గురుమూర్తి, సెరికల్చర్ అధికారి శోభారాణి, జిల్లా సహకార అధికారి క్రిష్ణా నాయక్, ఎల్డీఎం రమణకుమార్, పరిశ్రమల శాఖ అధికారి నాగరాజు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గేట్ల మరమ్మతులకు రూ.29 లక్షలు

త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం: మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కూడేరు మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడివైపు హెడ్ స్లూయిస్ గేట్ల మరమ్మతులకు రూ.29 లక్షల నిధులను జలవనరుల శాఖ మంజూరు చేసినట్లు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. వెంటనే పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. పీఏబీఆర్ ఉమ్మడి జిల్లా రైతాంగానికి జీవనాధారమన్నారు. గేట్ల లోపాల కారణంగా కొన్నేళ్లుగా సాగునీటి విడుదలలో ఆలస్యమవుతోందన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించామన్నారు. పనులు పూర్తయిన వెంటనే కుడికాలువకు నీరు విడుదల చేస్తారన్నారు.

కానిస్టేబుళ్ల తాత్కాలిక బదిలీ

పుట్టపర్తి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 15 మంది కానిస్టేబుళ్లను తాత్కాలికంగా బదిలీ చేస్తూ ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేటాయించిన స్టేషన్లలో వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. విధుల్లో చేరినవారి వివరాలను తన కార్యాయానికి పంపాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడేదాకా కేటాయించిన స్టేషన్లలో కానిస్టేబుళ్ళు విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని ఎస్పీ తెలిపారు.

భజనలుంటే.. విభజనలుండవు: ఆర్‌జే రత్నాకర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్‌జే రత్నాకర్ తదితరులు

గోరంట్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పల్లెలు, పట్టణాల్లో ప్రజలు భజనలు చేస్తే.. విభజనలు లేకుండా కలిసి ఉంటారని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజల మధ్య వర్గవైషమ్యాలు పెరుగుతున్నాయనీ, అందరూ కలిసి భక్తితో భజనలు చేయడం ద్వారా అవన్నీ తొలగిపోయి, స్నేహబంధం బలపడుతుందన్నారు. గోరంట్లలో భజన మండలి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీసత్యసాయి సేవాసదన్ భవనాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వ స్థలంలో ప్రజల విరాళాలతో భక్తులు రెండంతస్తుల భవనం భజన మండలి కోసం సుందరంగా నిర్మించారు. జ్యోతి వెలిగించి ఆర్‌జే రత్నాకర్ భవనాన్ని ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పూజల్లో పాల్గొన్నారు. బాలవికాస్ పిల్లలు వేదాలను పఠించారు. అనంతరం 108 మందికి వస్త్రదానం చేశారు. ఆర్‌జే రత్నాకర్ మాట్లాడుతూ.. సత్యసాయి బాబా గోరంట్ల మీదుగా బెంగళూరుకు వందలసార్లు వెళ్లారనీ, అలాంటి చోట భజనమండలి భవనం ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. అనంతరం మహామంగళహారతి, నారాయణసేవ (అన్నదానం) పెద్దఎత్తున నిర్వహించారు. బాబా చిత్రపటాన్ని పూల పల్లకిపై ఏర్పాటు చేసి, పట్టణ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, మహిళా సేవాదళ్ జిల్లా కోఆర్డినేటర్ విజయలక్ష్మి, భక్తులు సుబ్బరాయుడు, రత్నయ్య, టీడీపీ నాయకులు సోముశేఖర్, నిమ్మల విద్యాధరణి పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

టీఆర్ మహాలింగం (జయంతి)




'మాలి'గా పేరొందిన వేణుగాన కళాకారుడు తిరువిడైమరుదూర్ రామస్వామి మహాలింగం తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లాలో 1926 నవంబరు 6న జన్మించారు. కర్ణాటక సంగీతంలో వేణుగానానికి సంబంధించి సరికొత్త ప్రక్రియలను పరిచయం చేశారు. ఈయన శైలిలో గమకాలు గాత్ర సంగీతానికి అనుకూలంగా వేణువు పలికించడానికి వీలైంది. ఏడేళ్ళ ప్రాయంలోనే ఆయన సంగీత కచేరిలో పాల్గొన్నారు. ప్రత్యేకించి వెదురుతో చేసిన వేణువులపై అద్భుతమైన సంగీతాన్ని పలికించారు. 'పద్మభూషణ్' పురస్కారం ప్రకటించినా సున్నితంగా తిరస్కరించారు. 1986 మే 31న కన్నుమూశారు.

యశ్వంత్ సిన్హా (పుట్టినరోజు)



దేశ రాజకీయ నాయకులలో ఒకరైన యశ్వంత్ సిన్హా 1937 నవంబరు 6న బిహార్ రాష్ట్రం పాట్నాలో జన్మించారు. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రిగా పలు సంస్కరణలు తెచ్చారు. 1960లో ఐఏఎస్‌కు ఎంపికై 24 సంవత్సరాల పాటు పలు కీలక పదవులు నిర్వహించారు. బీజేపీ సీనియర్ నేతల్లో ఒకరైన ఆయన 2018 వరకు ఆ పార్టీలో కొనసాగారు. యూనివర్సిటీ ఆఫ్ పాట్నాలో కొంతకాలం ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. రెన్యూ పవర్ సంస్థాపక ఛైర్మన్‌గా వ్యవహరించి సంప్రదాయేతర ఇంధన వనరుల రంగంలో అపారమైన కృషి చేశారు. ఇటీవల ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్‌లో చేరినప్పటికీ రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆ పార్టీని వీడారు.

పాపినేని శివశంకర్ (పుట్టినరోజు)



కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ 1953 నవంబరు 6న గుంటూరులో జన్మించారు. తెలుగు సాహిత్యంలో కవి, కథకులు, విమర్శకులు, చిన్నకథల రచయిత. సాహితీ త్రిముఖుడిగా పేరొందారు. వందలాది కవితలు, చిన్నకథలు, వ్యాసాలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. తెలుగు అధ్యాపకులుగా, ప్రిన్సిపాల్‌గా పనిచేసి 2010లో రిటైరయ్యారు. అద్దేపల్లి రామ మోహన్‌రావ్ విమర్శ పురస్కారం, హనుమారెడ్డి పురస్కారం ఇతర గౌరవాలు అందుకున్నారు.

గల్లంతైన బాలల కోసం ముమ్మర గాలింపు



వేదవతి నదిలో గాలిస్తున్న రెస్క్యూ టీమ్, ఫైర్ సిబ్బంది

బళ్లారి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని పరమదేవనహళ్లి సమీపంలో మంగళవారం హగరికి చెందిన విష్ణు సాయి (14), కిరణ్ (16) అనే విద్యార్థులు నీటిలో స్నానం చేసేందుకు వేదావతి నదికి వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. వీరిని నది నుంచి వెలికి తీసేందుకు బళ్లారి నుంచి మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు రెస్క్యూ టీమ్‌తో పాటు ఫైర్ సిబ్బంది పోలీసులు, కుటుంబ సభ్యులు నదికి ఇరువైపులా వెతికినా ఫలితం లేకపోయింది. దాదాపు 15, 16 కిలోమీటర్ల దాకా వెతికినా వారి జాడ తెలియలేదు.

వరద సహాయక చర్యలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాయచూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వరదలు వచ్చినప్పుడు తీసుకోవల్సిన జాగ్రతలు, రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా చేపట్టింది. బుధవారం నగరంలోని చెరువు ప్రదేశంలో అగ్నిమాపక సిబ్బంది, ప్రత్యేక రక్షణ దళం, హోంగార్డుల విభాగం ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ, జిల్లా యంత్రాంగం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. వరదల్లో కొట్టుకుపోతున్న వారికి అగ్నిమాపక సిబ్బంది అందించే సహాయం, వరదల నుంచి బయట పడిన అనంతరం ప్రమాదానికి గురైన వారికి అందించే ప్రాథమిక చికిత్స గురించి ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. తహసీల్దార్ సురేశ్ వర్మం మాట్లాడుతూ కృష్ణా, తుంగభద్ర నది తీర ప్రాంతాల్లో పలు సందర్భాల్లో ఎదురవుతున్న వరద ప్రవాహ పరిస్థితిలపై ప్రజల్లో అప్రమత్తతను పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

జ్వాలాతోరణం

కదిరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం స్థానిక శివాలయంలో జ్వాలాతోరణం వెలిగించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీనరసింహస్వామి, ద్వారం ఆంజనేయస్వామి ఆలయాల్లో కూడా జ్వాలాతోరణం వెలిగించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లకు ఉయ్యాలోత్సవం నిర్వహించారు.



శివాలయంలో జ్వాలాతోరణాన్ని వెలిగిస్తున్న భక్తులు

శాంతిధామలో ఘనంగా కోటి దీపోత్సవం

బొమ్మనహళ్ళి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని శాంతి నికేతన్ లే అవుట్ శాంతిధామలోని మంజునాథస్వామి ఆలయంలో కోటిదీపోత్సవం వైభవంగా జరిగింది. బుధవారం ఉదయం పలు ప్రత్యేక పూజలు కొనసాగాయి. సాయంత్రం ఏర్పాటైన దీపోత్సవంలో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి పాల్గొని దీపాలు వెలిగించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 16 ఏళ్లుగా క్రమం తప్పకుండా ఏటా కోటి దీపోత్సవం ఆచరిస్తున్నారని తాను కూడా తరచుగా భక్తుడిగా సందర్శిస్తున్నట్టు తెలిపారు. శాంతిధామలో షిర్డీసాయిబాబా, మంజునాథస్వామి, సాయి సంతోషిమాత ఆలయాలు ఉండడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మేడా రామకృష్ణ మాట్లాడుతూ భక్తుల సహాయ సహకారాలతో సామాజిక సేవలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజుతోపాటు కార్తీక సోమవారం రోజున ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయన్నారు. దీపోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. కాగా సత్యనారాయణస్వామి వ్రతంలోనూ భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. దీపోత్సవంలో మాజీ కార్పొరేటర్‌లు పురుషోత్తం, మురళి, ట్రస్టు పదాధికారులు ముకేశ్‌కుమార్ వర్మ, తాతయ్యగుప్త, మనోహర్ గుప్త, వెంకటేశ్ గుప్తా, కృష్ణయ్యశెట్టి, సత్యనారాయణగుప్త, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.



మంజునాథస్వామికి అలంకరణ



దీపోత్సవంలో ఎమ్మెల్యే, ఆలయ ట్రస్టు పదాధికారులు

చెత్త నిర్వహణకు సహకరించండి

» నగరసభ కమిషనర్ చలపతి

చింతామణి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చింతామణి నగరసభ పరిధిలో రోడ్లపై ఇష్టం వచ్చినట్టు చెత్త పడేయరాదని ఇప్పటికే పలుమార్లు విన్నవించామని, చెత్త నిర్వహణకు ప్రజలు సహకరించాలని నగరసభ కమిషనర్ జీఎన్ చలపతి తెలిపారు. పట్టణంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ చెత్త నిర్వహణకు సంబంధించి పలుమార్లు ప్రజలకు సూచనలు చేశామని, అయినా అక్కడక్కడా నిర్లక్ష్యం తెలుస్తోందన్నారు. ఇకపై ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. చెత్త సేకరణ, విభజన వంటి అన్ని అభివృద్ధి పనులకు నగరసభ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు, నామినేటెడ్ సభుయలు సంపూర్ణంగా సహకరించారని, వారి అధికార అవధి గడువు ముగిసినా సహకారం అందించారన్నారు. ప్రజలసమస్యల పరిష్కారానికి పూర్తి చొరవ చూపుతానన్నారు. పట్టణ వ్యాప్తంగా వీధులలో చెత్త పడేసేవారిని గుర్తించేందుకు పలుచోట్ల సీసీ కెమెరాలు అమర్చామన్నారు. మరికొన్నిచోట్ల సీసీ కెమెరాల అమరిక చేపట్టాల్సి ఉందన్నారు. ఇంటిముంగిటకే చెత్తసేకరణ వాహనాలు వస్తాయని సాధ్యమైన మేరకు తడి, పొడి చెత్తను వేరుగా ఇవ్వాలన్నారు. ఒకవేళ ఏ ప్రాంతంలోనైనా చెత్తసేకరణ వాహనం రాకున్నా, ఎక్కడైనా చెత్త సమస్య ఉంటే నగరసభ ఆరోగ్య అధికారులు ఆరతి, విజయకుమార్, వీరణ్ణ గౌడ పాటిల్‌ల ఫోన్లకు సమాచారం ఇస్తే తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ఒకవేళ అధికారులు ఎవరైనా స్పందించకుంటే తన మొబైల్, వాట్స్ ఎకు 83107 34404 సమాచారం ఇవ్వాలన్నారు. కాగా వదంతులను ఎవరూ పట్టించుకోవద్దని సూచించారు. పట్టణం మౌలిక సదుపాయాల కల్పనకు మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ పలు సూచనలు చేశారని ఆ మేరకు ప్రాధాన్యతాపరంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.



కమిషనర్ జీఎన్ చలపతి

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

విజయపుర, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తాలూకా స్థాయి హైస్కూల్ విభాగంలో అథ్లెటిక్స్‌లో పోటీలలో పట్టణంలోని ప్రగతిహైస్కూల్ విద్యార్థులు ఉత్తమ సాధన కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. దేవనహళ్ళి ప్రభుత్వ పీయూ కళాశాల క్రీడామైదానంలో 2025-26 సంవత్సరానికి తాలూకాస్థాయి హైస్కూల్ క్రీడా పోటీలు జరిగాయి. 100 మీటర్ల, 200 మీటర్ల పరుగు, షాట్ పుట్, హైజంప్, లాంగ్‌జంప్, త్రిపుల్‌జంప్, జావెలిన్ త్రో తదితర పోటీలలో ప్రగతిహైస్కూల్ విద్యార్థులు సత్తా చాటుకున్నారు. పద్మశ్రీ, హరిణి, శ్రేయశ్రీ, పావని, ప్రతీక్షా, కేశవప్రసాద్, జి ప్రణీత్‌లు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేత విద్యార్థులను సంస్థ అధ్యక్షుడు ఎం సతీశ్‌కుమార్, ఎండీ కృపా శంకర్, పాలనాధికారులు రజతా పటేల్ అభినందించారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థుల బృందం

సామాజిక సేవలు ప్రశంసనీయం

» వాసవి లలితకళ, రంగస్థల కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

బొమ్మనహళ్ళి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆరికెరెలోని వాసవి ఆలయానికి అనుబంధమైన ట్రస్టు కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోందని సమాజసేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి కొనియాడారు. ఎమ్మెల్యే నిధులతో ఆధునీకరించిన వాసవి లలితకళ, రంగస్థల కేంద్రాన్ని బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. గతంలో వాసవి కళ కేంద్రాన్ని ప్రారంభించగా తాజాగా ఆధునీకరించిన కేంద్రాన్ని కార్తీక పౌర్ణమి రోజును ప్రారంభించారు. వాసవి దేవాలయం ట్రస్టు గ్రామీణ ప్రాంతాలలో పలు సామాజిక సేవలు అందిస్తోందని ఎమ్మెల్యే కొనియాడారు. మరింత సామాజిక సేవలందించి చేయూత ఇవ్వాలని అభిలషించారు. ప్రధాని నరేంద్రమోదీ బెంగళూరులో ఇటీవల మెట్రోసేవలు అందించారన్నారు. ఆయనే తొలి సేవకుడని ప్రకటించుకున్నారన్నారు. వాసవి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పోతణ్ణశెట్టి మాట్లాడుతూ పేదలకు గోదానం చేయడం ద్వారా పాడిపెంపకానికి తమవంతు చేయూత ఇస్తున్నామన్నారు. అలాగే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందచేస్తున్నామన్నారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించదలిచామన్నారు. ఈనెల 23న ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మాజీ కార్పొరేటర్‌లు పురుషోత్తమ్, మురళి, ట్రస్టు ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, సెక్రటరీ నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ గోవిందరాజశెట్టి, రాజశేఖరశెట్టి, మాలతేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి

నీటి పన్ను పెంచిన మహానగర పాలికె

● నెలకు రూ.30 చొప్పున పెంపు

రాయచూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలో తాగునీటి పన్నును పెంచుతూ రాయచూరు మహానగర పాలికె బుధవారం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు రూ.15 ఉన్న గృహ అవసరాల తాగునీటి పన్నును రూ.30కు పెంచారు. దీంతో పాటు గృహేతర అవసరాలకు 30 ఉన్న పన్నును రూ.60, వాణిజ్య విభాగాలకు రూ.60 ఉన్న ఉన్నును రూ.120 పెంచారు. దీంతో పాటు తాగునీటి కనెక్షన్ సొమ్మునూ పెంచారు. గృహ అవసరాలకు రూ.2వేలు గృహేతర వాటికి రూ.3వేలు, వాణిజ్య అవసరాల కోసం రూ.5వేలు చెల్లించి వినియోగదారులు తమ కనెక్షన్ పొందాల్సి ఉంటుంది. దీంతో పాటు భూగర్భ డ్రైనేజీలోకి వ్యర్థ నీటిని వదలే వారికి విధించే అపరాధ సొమ్మును అధికారులు ఒక్కసారిగా పెంచేశారు. గృహ అవసరాల వారికి రూ.5వేలు, గృహేతర వాటికి రూ.10వేలతో పాటు వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే వారికి రూ.15వేలు జరిమానా విధించేందుకు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇప్పటికే ఇద్దరికి రూ.10 వేల చొప్పున అపరాధ రుసం విధించినట్లు పాలికె కమిషనర్ జుబిన్ మోహపాత్ర తెలిపారు. దీనిపై స్పందించిన మేయర్ నరసమ్మ మాడగిరి ఇతర మహానగర పాలికెలతో పోలిస్తే రాయచూరులో తాగునీటి పన్ను తక్కువగా ఉన్నట్లు గుర్తు చేశారు. గృహ అవసరాలకు నెలకు రూ.30 పన్ను వసూలు చేస్తున్నామని ఇది దినసరి కేవలం రూ.1 మాత్రమేనన్నారు.



తాగునీటి నాణ్యతను పరీక్షిస్తున్న ఇంజనీరు



ధ్వంసమైన చిన్నాపూర్, కరడి ఆనకట్టలను కలిపే రహదారి

రహదారి అధ్వానం

కంప్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నిరంతరాయంగా కురిసిన వర్షాలకు విజయనగరం జిల్లా హొస్పేట తాలుకాలోని బైలువద్దిగేరి చెరువు ఒడ్డున ఉన్న బైలువద్దిగిరి చిన్నాపూర్, కరడి ఆనకట్టలను కలిపే రహదారి ధ్వంసమై కూలిపోయింది. దీనివల్ల వాహనాల రాకపోకలకు, ప్రజా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్డు కుంగిపోవడం, చెరువు పొంగి ప్రవహించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మంచి వర్షాలు కురవడంతో చెరువు పూర్తిగా నీటితో నిండిపోయింది. చేపట్టే పనులు నాణ్యత లేకపోవడంతోనే రోడ్డు దెబ్బతిందని స్థానికులు విమర్శిస్తున్నారు. వెంటనే ధ్వంసమైన రోడ్డును మరమ్మతు చేపట్టి రాకపోకలకు అనువుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

పశ్చిమ బెంగాల్ మహిళను హింసించిన

ముగ్గురు పోలీసుల సస్పెన్షన్

బెంగళూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దొంగతనం ఆరోపణల కారణంగా ఫిర్యాదు దారుడి ఇంట్లో పనిచేసే మహిళను పోలీసుస్టేషన్‌కు పిలిపించి కిరాతకంగా కొట్టిన వివాదంలో వర్తూరు పోలీసులు ముగ్గురిని సస్పెండ్ చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన ఆమె వర్తూరు పరిధిలోని ఓ ఇంట్లో పనిచేసేవారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు విచారణ పేరుతో పోలీస్‌స్టేషన్‌కు రప్పించి విచక్షణా రహితంగా కొట్టారు. వర్తూరు పోలీస్‌స్టేషన్ క్రైం సిబ్బంది సంజయ్ రాథోడ్, సంతోష్ కుదరి, అర్చనాలను సస్పెండ్ చేస్తూ వైట్‌ఫీల్డ్ డీసీపీ కే పరశురామ్ బుధవారం ఆదేశించారు. మారతహళ్ళి సబ్‌డివిజన్ ఏసీపీ నివేదిక మేరకు సస్పెండ్ చేసినట్టు తెలిపారు. కాగా సరైన పర్యవేక్షణ చేయడంలో విఫలమైన ఎస్సై మౌనేశ్ దొడ్డమనికి నోటీసు జారీ చేశారు. పనిమనిషిపై దాడి ఘటన జాతీయ స్థాయిలో సంచలనమైంది. పశ్చిమబెంగాల్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు, వలసకార్మికుల సంఘం అధ్యక్షుడు సమీర్ ఉల్ ఇస్లాం నేరుగా సీఎం మమతాబెనర్జీకు ఫిర్యాదు చేశారు. దీంతో బెంగళూరు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న బాధితురాలిని పశ్చిమబెంగాల్ సీఎం కార్యాలయ అధికారులు ఆరా తీశారు. విచారణల పేరుతో ఇలా కొడతారా అంటూ ఎంపీ మండిపడటంతో సంచలనమైంది. కాగా రాష్ట్ర మహిళా హక్కుల కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ నాగలక్ష్మి చౌదరి తీవ్రంగా పరిగణించి డీసీపీకి లేఖ రాశారు. వర్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక అపార్ట్‌మెంట్‌లో అక్టోబరు 30న తమ ఇంట్లో డైమండ్ రింగ్ చోరీకి గురైందని వర్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో పనిచేసే పశ్చిమబెంగాల్‌కు చెందిన 34ఏళ్ల మహిళ సుందరి బీబి చోరీ చేసి ఉండవచ్చుననే అనుమానం వ్యక్తం చేశారు. దీంతో ఎస్సై ఎన్‌సీఆర్ నమోదు చేశారు. మరుసటి రోజు క్రైం సిబ్బంది సదరు మహిళను పోలీస్‌స్టేషన్‌కు రప్పించి దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆమెను శివాజినగర్‌లోని బౌరింగ్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. మహిళను విచారణల పేరుతో తీవ్రంగా కొట్టిన ముగ్గురు పోలీసులపై వేటు పడింది.

సాదలిలో ఎమ్మెల్యే పర్యటన



అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

శిడ్లఘట్ట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని రామసముద్ర చెరువు మరవ పారినప్పుడు దిగువన ఉండే సాదలి, దేవగానహళ్ళి పంచాయతీల పరిధిలో కొన్నిచోట్ల రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో సంచారానికి ఇబ్బందిగా ఉందని ప్రజలనుంచి ఫిర్యాదులు రావడంతో ఎమ్మెల్యే రవికుమార్ స్పందించి బుధవారం పర్యటించారు. సాదలి క్రాస్ నుంచి ఎస్ దేవగానహళ్ళి క్రాస్ వరకు రోడ్డు నిర్మాణాలలో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. సాదలి గ్రామంలోని హక్కిపిక్కి కాలనీకి, ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలకు కేవలం ఒక్కటే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో విద్యుత్ కనెక్షన్‌లకు సమస్యగా ఉందని స్థానికులు ప్రస్తావించారు. దీంతో ఇందుకు శాశ్వత పరిష్కారం కల్పించే చర్యలు చేపట్టాలని బెస్కాం అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట స్థానికప్రముఖులు తాదూరు రఘు, త్యాగరాజ్, గంగాధర్, ఆంజినప్ప, పీడబ్ల్యూడీ అధికారులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న టమోటా

చేళూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తాలూకాలో బోర్లకింద సాగు చేస్తున్న టమోటా పంట ఆశించినంత ఆదాయం ఇవ్వకపోగా నష్టాలు మిగిల్చిందని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రారంభంలో దిగుబడి బాగానే ఉన్నప్పటికీ డిమాండ్‌లేక ధర పలకలేదన్నారు. ప్రస్తుతం ఇటీవల వరుస వర్షాలతో నల్లటి మచ్చలు ఏర్పడి దిగుబడి తగ్గిందని, ధర కూడా తగ్గిపోయిందని విచారం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో పంటనష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం




ఘటనాస్థలంలో పరిశీలిస్తున్న పోలీసులు

దొమ్మసంద్ర, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర పట్టణం ముస్లిం స్మశానవాటిక సమీపాన బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. బుధవారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు పరిశీలించారు. మృతుడికి 35-40 ఏళ్లు ఉంటాయన్నారు. పోస్టుమార్టం నిమిత్తం అత్తిబెలె ఆక్స్‌ఫర్డ్ ఆసుపత్రికి తరలించారు. బెంగళూరు గ్రామీణ జిల్లా అడిషినల్ ఎస్పీ వెంకటేశ్ ప్రసన్న, డీఎస్పీ మోహన్‌కుమార్, సర్జాపుర ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్‌లు పరిశీలించారు.

పంట కొనుగోలు కేంద్రం ప్రారంభం

బళ్లారి సిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వేరుశనగ, పొద్దుతిరుగుడు ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఛైర్‌పర్సన్, కలక్టర్ కవితా మన్నికేరి తెలిపారు. 2025-26 వర్షాకాలానికి ప్రభుత్వం మద్దతు ధర పథకం కింద ఎఫ్ఏక్యూ నాణ్యమైన వేరుశనగ ధర క్వింటాలుకు రూ.7,263, పొద్దుతిరుగుడు ధర రూ.7,721గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. విజయనగరం జిల్లాలోని నూనెగింజల పెంపకదారుల సహకార సంఘాలు రైతుల నుంచి పంట కొనుగోలు చేయడానికి అన్ని తాలూకాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. మరింత సమాచారం కోసం 803779774 నంబరును సంప్రదించవచ్చన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.96	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,386	13,325
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,852	12,905
నీటి నిల్వ (టీఎంసీలు)	79.67	101.77

భక్తిశ్రద్ధలతో దేవున్ని ప్రార్థించాలి



మాట్లాడుతున్న శివయోగి సిద్ధేశ్వర మహాస్వామి

సిరుగుప్ప, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): భక్తిశ్రద్ధలతో దేవున్ని ప్రార్థించాలని తుమకూరు సిద్దగంగ మఠం శివ సిద్ధేశ్వరస్వాములు అన్నారు. బుధవారం తాలుకాలోని కర్చిగనూరు గ్రామంలో మహంత శివయోగి మఠంలో పురాణ పఠన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శివసిద్దేశ్వర స్వామి మాట్లాడుతూ.. తుమకూరు సిద్దగంగ మఠంలో వేలాది మంది విద్యార్థులు ఉచిత విద్య, అన్నదాన సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భగవంతున్ని భక్తిశ్రద్ధలతో పూజించిన వారికే ప్రతిఫలం దక్కుతుందని అన్నారు. దేశంలో పురాణాలకు ఎంతో చరిత్ర వుందన్నారు. ఆల్వీ అభినవ మహంత స్వాములు, బసవరాజ స్వాములు పాల్గొన్నారు.

కౌన్సిలర్లు, అధికారుల వాగ్వాదం



చీకటిలోనే సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

సిరుగుప్ప, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): టెక్కలకోట పట్టణంలో అన్ని వార్డులలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కౌన్సిలర్లు అధికారులతో వాగ్వాదం చేశారు. బుధవారం తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విద్యుత్ అంతరాయం వల్ల ఫోన్లతో లైట్లు వేసుకుని చీకటిలోనే సమావేశం నిర్వహించారు. పట్టణ పంచాయతీ అధ్యక్షుడు అభివృద్ధి పనులపై ప్రసంగించారు. స్థాయిసమితి అధ్యక్షుడు ఖాదర్ వలీ వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు. పట్టణ పంచాయతీ ముఖ్య అధికారి పరశురామ్, ఉపాధ్యక్షురాలు రంగమ్మ, కౌన్సిలర్ నిజాముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యురాలిని నియమించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నేతలు

కంప్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ సముదాయ ఆస్పత్రిలో మహిళా డాక్టర్‌ను నియమించాలని తహసీల్దార్ మంజునాథనాయక్‌కు వివిధ సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. గుడిమనే కరెప్ప, వసంతకాలే మారెప్ప మాట్లాడుతూ.. ఆస్పత్రిలో మహిళా డాక్టర్ లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే డాక్టర్‌ను నియమించి ఆస్పత్రికి వచ్చే రోగులకు సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. లక్ష్మణ్, రవి రాజకుమార్, నాగరాజు, సన్నీ, వీరేష్, హుస్సేన్, రాజభక్షి, బసవరాజు, హుస్సేన్ పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..!



శంకరబండలో రహదారి దుస్థితి

బళ్లారిరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని శంకరబండ గ్రామంలో బళ్లారి నుంచి ఆంధ్రలోని ఉరవకొండ తదితర ప్రాంతాలకు వెళ్లే రోడ్డు పనులు ఆలస్యం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షం వస్తే రహదారి బురదమయమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారు మాట్లాడుతూ.. వీలైనంత త్వరలో రోడ్డు పనులు పూర్తి చేసి, అనుకూలంగా ఉండేలా చూడాలని కోరుతున్నారు. ఇందుకు సంబంధించిన అధికారులు శ్రద్ధవహించి పనులు వేగవంతం చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

బ్రెయిన్ స్ట్రోక్ పట్ల నిర్లక్ష్యం వద్దు

● డాక్టర్ బసారెడ్డి

బళ్లారి సిటీ, నంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినప్పుడు దానిని విస్మరించకుండా వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి సరైన చికిత్స పొందాలని జిల్లాసర్జన్ డాక్టర్ బసారెడ్డి సూచించారు. చలవాది వీధిలోని 7వ వార్డు అంబేడ్కర్ భవన్‌లో జిల్లాయంత్రాంగం, పంచాయతీ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, కర్ణాటక బ్రెయిన్ ఇనీషియేటివ్, బ్రెయిన్ హెల్త్ ట్రీట్‌మెంట్ సెంటర్, జిల్లా ఆసుపత్రి, మరిస్వామి మఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి క్షణం లెక్కించబడుతుంది అనే నినాదంతో నిర్వహించిన ప్రపంచ స్ట్రోక్ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్ట్రోక్ లేదా బ్రెయిన్ ట్రామా అనేది మెదడుకు తక్కువ ఆక్సిజన్ అందే పరిస్థితి, 30ఏళ్లు పైబడిన వారు ప్రతి 6 నెలలకు ఒకసారి ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలి. మద్యం, ధూమపానానికి దూరంగా ఉండి వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. స్ట్రోక్ లక్షణాలను గుర్తించుకోవడానికి బి-ఫాస్ట్ అనే సంక్షిప్త పదాన్ని ఉపయోగిస్తామన్నారు. బి-బ్యాలెన్స్ అంటే రోగి శరీర సమతుల్యత కోల్పోవడం, ఈ-ఐస్ అంటే దృష్టి సమస్యలు, ఈవి కొంతమందిలో అంధత్వానికి కారణమవుతాయన్నారు. ఎఫ్-ఫేస్ అనేది ముఖం ఒక వైపు అసమానత, ఏ-ఆర్మ్ బలహీనత అంటే చేయి లేదా కాలుపై నియంత్రణ కోల్పోవడం, ఎస్-స్పీచ్ భంగం అంటే నత్తిగా మాట్లాడం, మాటలు అస్పష్టంగా ఉండటం లేదా ఇతరులు ఏమి చెబుతున్నారో అర్థం చేసుకోలేకపోవడమని అర్థమన్నారు. అలాగే టీ-టైమ్ అంటే రోగి పూర్తిగా సాధారణ స్థితిలో ఉన్నప్పుడు లేదా స్ట్రోక్ తర్వాత మొదటి నాలుగు గంటలు (గోల్డెన్ అవర్)లోగికి వైద్య సహాయం అందించాలన్నారు. జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ అమలు అధికారి కుష్టువ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ వీరేంద్ర కుమార్ మాట్లాడుతూ స్ట్రోక్ అంటే మెదడులోని రక్తనాళం అడ్డుపడటం లేదా చీలిపోవడం వల్ల నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుందన్నారు. స్ట్రోక్‌లో రెండు రకాలు ఉన్నాయని వాటిలో ఇస్కీమిక్ స్ట్రోక్ ఇది రక్తనాళం గడ్డకట్టడం, మెదడు కణజాలాన్ని దెబ్బతీసినప్పుడు వస్తుందన్నారు. రెండోది హెమరేజిక్ స్ట్రోక్ ఇది రక్తనాళం పగిలి మెదడులోకి రక్తస్రావం అయినప్పుడు వస్తుందన్నారు. జీవనశైలీలో మార్పుల వల్ల ఆరోగ్యంలో హెచ్చుతగ్గులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. క్రమం తప్పకుండా ఆహారం, యోగా, వ్యాయామం, సంగీతం వంటి ఇతర చురుకైన కార్యకలాపాలలో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని, స్థిరమైన ఆరోగ్యాన్ని పొందాలని ఆయన పిలుపునిచ్చారు. అధిక రక్త, అధిక మధుమేహనం, తలతిరగడం లేదా రక్త ప్రసరణలో మార్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి అవసరమైన చికిత్స పొంది వ్యాధిబారి నుంచి బయటపడాలన్నారు. కార్యక్రమంలో మహానగర పాలికె ఉమాదేవి శివరాజు, కర్ణాటక చలవాది మహాసభ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మరిస్వామి మఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సౌజన్య, జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఖుర్షీద్ బేగం, కర్ణాటక బ్రెయిన్ హెల్త్ ఇనీషియేటివ్ జిల్లా ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్ సన్నకేశవ, వైద్య అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్జన్ డాక్టర్ బసారెడ్డి

చెరకుకు మద్దతు ధర ప్రకటించాలి: ఏఐకేకేఎంఎస్

బళ్లారి సిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చెరకు రైతుకు రూ.4800 మద్దతు ధర ప్రకటించాలని ఏఐకేకేఎంఎస్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర కార్యదర్శి భగవాన్‌రెడ్డి మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని చెరకు రైతులు కష్టాలు, నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం రైతులు చక్కెర కర్మాగారాల కోసం చెరకును పండిస్తారన్నారు. దేశ ప్రజలకు తీపి తినిపిస్తున్నా రైతులకు చేదే మిగిలుతోందన్నారు. లాభదాయక ధరల నిర్ణయం, పంట ఆలస్యమైంది, బకాయిల చెల్లింపు పెండింగ్, ప్రకృతి వైపరీత్యాలు, ఉత్పత్తి ఖర్చులు చాలా ఏళ్లుగా పెరుగుతున్నాయన్నారు. చెరకును పండించడానికి సగటున ఎకరానికి రూ.60,000 నుంచి రూ.80,000 వరకు ఖర్చు అవుతోందన్నారు. ఎరువులు, కార్మికుల వేతనాలు, నీటిపారుదల, డీజిల్, యంత్రాలు, రవాణా ఖర్చులు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. కానీ ప్రభుత్వం చక్కెర కర్మాగారాలు తగిన న్యాయమైన ధరలను చెల్లించడం లేదన్నారు. ఇది పారిశ్రామిక యజమానుల లాభాలను పెంచే విధానమన్నారు. బకాయి ఉన్న వేతనాలకు టన్‌చెరకుకు రూ.150 వడ్డీతో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బళ్లారి జిల్లా కార్యదర్శి గురల్లి రాజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐకేకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి భగవాన్ రెడ్డి

వ్యాపారుల కోసం అన్నదాత ఎదురుచూపు



అమ్మకానికి రోడ్లపై సిద్ధంగా ఉంచిన వరిధాన్యం

కంప్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటలో వరి పండించిన రైతులు పంట అమ్మకాలు కోసం వరిధాన్యం రోడ్లపై వేసుకుని వ్యాపారుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది రైతుకు వరిపంట నష్టాన్ని మిగిల్చింది. మార్కెట్‌లో 75 కిలోల వరిధాన్యం రూ.1500 నుంచి రూ.1600 పలుకుతున్నాయి. ఏపీఎంఎస్‌లో వరి కొనుగోలు కేంద్రం లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంప్లి తాలుకా పరిధిలోని సన్నాపురం, ఇటిగి, వెలుగోడుహాళ్, నారాయణ స్వామి క్యాంపు, బసవేశ్వర క్యాంపు, ముద్దాపురం తదితర గ్రామాల్లో వరిపంటలు వేసిన రైతులు అధిక వర్షాలకు పంట నేలకొరిగి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కోతమిషన్లకు ఎంత డిమాండ్ ఉన్నా వేలు ఖర్చు చేసి పంటను కోయించి వరి ధాన్యాన్ని అమ్మకాలకు సిద్ధం చేశారు. కానీ వ్యాపారులు కొనేందుకు ముందుకు రావడంలేదని రైతులు అంటున్నారు. గత ఏడాది కూడా అధిక వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయాం. కోసిన పంటలు అమ్మే సమయంలో వర్షాలు కురిశాయి. ఈ నెపంతోనే వ్యాపారులు కొనుగోలు చేసే విషయంలో వెనకడుగు వేశారని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వరిపంట దిగుబడుల కన్నా పెట్టుబడులే ఎక్కువ వచ్చాయని తెలిపారు. కౌలు రైతులు పూర్తిగా నష్టపోయారని వాపోతున్నారు.



కొనుగోలు చేసిన వరిధాన్యాన్ని లారీలోకి లోడు చేస్తున్న కూలీలు

చక్కెర హారతులకు భలే డిమాండ్



చక్కెర హారతులను కొనుగోలు చేస్తున్న ప్రజలు

సిరుగుప్ప, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గౌరీ పండుగను పురస్కరించుకుని చక్కెర హారతులకు డిమాండ్ పెరిగింది. తాలుకా వ్యాప్తంగా గౌరీదేవి వేడుకలు కన్నులపండువగా ప్రారంభమయ్యాయి. గౌరీదేవికి పూజలు చేయాలంటే చక్కెర హారతులు, పూలు, పండ్లు అత్యవసరం. దీంతో కిలో రూ.150 చక్కెర హారతుల ధర పలికిగింది. పూలు, పండ్ల ధరలు విపరీతంగా పెరిగాయి. గౌరీదేవి మట్టి విగ్రహాలు రూ.300 నుంచి రూ.500 వరకు పలుకుతున్నాయి. పట్టణంలో ప్రధానంగా ఆదోని రోడ్డుమార్గంలో ఈశ్వర దేవాలయ ప్రాంగణంలో ఉచ్చీరప్పతాత ఆలయ ఆవరణలో, సింధనూరు రోడ్డు దేశనూరు రోడ్డు మార్గంలో సదాశివనగర్‌లో గౌరీదేవి విగ్రహాలను ప్రతిష్ఠాపన చేశారు. తాలుకా వ్యాప్తంగా గురువారం గౌరీదేవి పండుగ వైభవంగా జరుగనుంది.

అంగన్‌వాడీ కేంద్రం మార్పు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బళ్ళారి గాంధీనగర్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): సండూరు తాలూకా కురేకుప్ప పట్టణంలో అంగనవాడీ కేంద్రం దుస్థితి గురించి ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన 'అధ్వాన స్థితిలో అంగనవాడీ కేంద్రాలు' కథనానికి తాలూకా మహిళా శిశు సంక్షేమ అధికారులు స్పందించారు. ఇరుకైన స్థలంలో అంగనవాడీ కార్యకర్తతో ఇంటిలో నిర్వహిస్తున్న కేంద్రాన్ని తాత్కాలికంగా మరో అంగనవాడీ కేంద్రానికి మార్చారు. శిథిలమైన అంగనవాడీ కేంద్రం పిల్లలకు రక్షణ లేని కారణంగా కార్యకర్త తాత్కాలికంగా కొన్నిరోజులు ఇంటిలోనే నిర్వహించిందని, ప్రస్తుతం కురేకుప్ప పట్టణంలో 4వ వార్డులో ఉన్న కేంద్రాన్ని మరో చోటుకి తరలించినట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి నాగరాజు తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరలో అంగనవాడీ కేంద్రం నిర్మాణానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.



పట్టణంలోని మరో అంగనవాడీ కేంద్రంలో సేద తీరుతున్న చిన్నారులు



హంపిలో జ్యోతులను వెలిగిస్తున్న పర్యాటకులు

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

కంప్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈశ్వరాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జ్యోతులను వెలిగిస్తున్న మహిళలు మొక్కులు సమర్పించుకున్నారు. కంప్లి, హంపి, కురుగోడు పరిధిలోని గ్రామాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బళ్లారిరూరల్ (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని బాలాజీనగర్ అమృతేశ్వరాలయంలో స్వామివారికి విశేష పూజలు, దీపోత్సవం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్నారు. అలాగే వెంకటేశ్ నగర్‌లో వెలిసిన వరద అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం సత్యనారాయణ పూజతో పాటు రాత్రి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ధనుంజయ తెలిపారు. ఉపాధ్యక్షులు, సభ్యులు పీఎం నటరాజు, శ్రీరాములు, నాగేష్ కుమార్, రాజశేఖర్‌రెడ్డి, ముల్లంగి గిరి, హరీష్, జంభు, వీరేష్, రాజు, సత్తిబాబు, లోకరాజు పాల్గొన్నారు.



సత్యనారాయణ పూజలో పాల్గొన్న భక్తులు

బీడీసీసీఐ అధ్యక్షుడిగా మంజునాథ్



బళ్లారి సిటీ,నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి(బీడీసీసీఐ) నూతన అధ్యక్షుడిగా అవ్వరు మంజునాథ్ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంస్థ భవిష్యత్తును నిర్ధారించేందుకు కొత్తవారికి అవకాశాలు కల్పించడానికి ప్రస్తుత అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి రాజీనామా చేసిన తర్వాత బుధవారం జరిగిన కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో మంజునాథ్ ను ఎన్నుకున్నారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.దొడ్డనగౌడ, వైస్‌ప్రెసిడెంట్‌గా పి.పాలన్న, కోశాధికారిగా నాగల్లి రమేశ్‌లను ఎన్నుకున్నారు. యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి మాట్లాడుతూ సంస్థ వజ్రోత్సవాలను జరుపుకుంటోందని అన్నారు. సంస్థ భవిష్యత్తును రూపొందించడానికి సమర్థులైన నాయకులను సృష్టించడానికి మంజునాథ్‌కు అధికారం అప్పగించినట్లు తెలిపారు. గౌరవ కార్యదర్శిగా కేసీ సరేశ్‌బాబు, ఉపాధ్యక్షుడిగా సొంత గిరిధర్, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ మల్లికార్జునగౌడ, వి.రామచంద్ర కొనసాగుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, కార్యవర్గసభ్యుడు సత్యనారాయణ, రాజేశ్, నేకర నాగరాజ్, తాటకూరి శ్రీనివాసరావు, గిరీశ్, జితేంద్రప్రసాద్, గోవిందరెడ్డి, రాజేశ్‌కుమార్, పి.వెంకటేశ్, దీపక్, నాగరాజ్, వేణుగోపాల్ గుప్తా, రాఘవేంద్రరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.




కన్నడ భాషా సంస్కృతి ఉట్టిపడేలా అలంకరించిన కేఎస్ ఆర్టీసీ బస్సు

ఉట్టిపడిన భాషాభిమానం

బళ్లారి గాంధీనగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కన్నడ భాషను సూచించి పసుపు, కుంకుమ రంగు బస్సు వెలుపల కన్నడ భాష గొప్పతనానికి కృషి సాధువులు, భక్తులు, రచయితల చిత్రాలు, ముందు భాగంలో భువనేశ్వరి విగ్రహం, వీటన్నిటితో పాటు బస్సు చుట్టూ కన్నడ జెండాలు ఎగురుతున్నాయి. కన్నడ భాషను వ్యాప్తి చేసే పాటలు ప్రయాణికులను ఉత్సాహాన్ని నింపుతున్నాయి. హావేరి జిల్లాలోని నార్త్‌వెస్టర్న్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌కు చెందిన కేఎస్‌ఆర్టీసీ బస్సు హిరేకెరూరు డిపోకు చెందిన బస్సు చెన్నమ్మ కిత్తూరు మీదుగా కోల్హాపూర్ వెళ్ళే జాతీయ రహదారిపై ప్రయాణిస్తుంది. బస్సుమీద ఉన్న శాసనం ఇలా ఉంది... మీ చేతులు ముడుచుకుని ఎక్కండి.. ఇది హిరేకెరూర్ యూనిట్‌కు చెందిన కన్నడ బస్సు. ఈ బస్సును చూసిన తరువాత చాలామంది ఫొటోలు తీసుకుంటూ బస్సును కన్నడ మయం చేసినందుకు కండక్టర్, డ్రైవర్‌కు అభినందిస్తున్నారు. కర్ణాటక రాజ్యోత్సవం సందర్భంగా సీనియర్ అధికారుల సహాయంతో బస్సుకు కన్నడదనం ఉట్టిపడేలా అలంకరించినట్లు, ప్రజల్లో కన్నడ పట్ల ప్రేమను పెంచేందుకు ఈ విధంగా చేసినట్లు సిబ్బంది తెలిపారు.

హోసూరు జోన్

ఆలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు



పండ్లు, కూరగాయలతో సోమేశ్వరస్వామికి అలంకరణ

హోసూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా హోసూరు వ్యాప్తంగా బుధవారం పలు ఆలయాలలో విశేషపూజలు కొనసాగాయి. హోసూరు తేరుపేటలోని మరకదాంబ చంద్రచూడేశ్వర ఆలయం, బృందావనం నగర్‌లోని జ్ఞానాంబిక సమేత యోగీశ్వర ఆలయం, రాంగనగర్‌లోని సోమేశ్వర ఆలయం, మోరనపల్లిలోని ప్రత్యంగిరా దేవి ఆలయం, ఇతర శివాలయాలలో అభిషేకం, అలంకరణలు జరిగాయి. సోమేశ్వర ఆలయంలో పరమశివుడికి పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. కూరగాయలు, పండ్లతో అలంకరించారు. ప్రత్యంగిరాదేవి ఆలయంలో విశేషహోమం జరిగింది. ప్రజల శ్రేయస్సుకోసం నిర్వహించే హోమంలో ఇక్కడ మిరపకాయలు సమర్పించడం ఆనవాయితీ. పూజల్లో భక్తాదులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. అంచెట్టి సమీపం ఉరిగం సమీపం నూరొందుబెట్ట ఆలయంలో వెలసివున్న శివాలయంలో మంచినీటిలో దీపం వెలిగించి అన్నాభిషేకం సమర్పించారు.

స్వయం ఉపాధి పథకాల పనితీరుపై కలెక్టర్ ఆరా

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి ఉద్యమంలో భాగంగా అమలవుతున్న పథకాల పనితీరు గురించి కలెక్టర్ దినేశ్‌కుమార్ స్వయంగా పరిశీలించారు. మహిళా స్వయం సహాయక బృందాల లబ్ధిదారులకు ఆవులు, మేకలు, కోళ్లు పంపిణీ చేశారు. కృష్ణగిరి పంచాయతీ యూనియన్‌లోని వెలగలపల్లి, చిక్కపూవట్టి, బెత్తతలపల్లి, మోరమడుగు పంచాయతీలలో మేకలు, పాడి పశువుల పెంపకం పథకం క్రింద మేకలు, ఆవులను పంపిణీ చేశారు. లబ్ధి పొందిన మహిళా స్వయం సహాయక బృంద సభ్యులు, లెట్స్ అవర్ లైన్స్ పథకం తరపున సహ-సబ్సీడీ పథకం క్రింద చేపల ఆహార ఉత్పత్తి, కోళ్ల పెంపకంలో నిమగ్నమై ఉన్న మహిళా స్వయం సహాయక బృంద సభ్యులతో కలెక్టర్ ఎస్ దినేశ్‌కుమార్ బుధవారం పథకం ప్రయోజనాల గురించి ఆరా తీశారు. మహిళా స్వయం సహాయక బృందాలకు వివిధ ప్రయోజనాలను అందించే గుర్తింపు కార్డుల ద్వారా గ్రామీణ, పట్టణ బస్సులలో 25 కిలోమీటర్ల వరకు ఉచితంగా తమ ఉత్పత్తులను తీసుకెళ్లడానికి అనుమతి ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. పంట రుణాలు, పశువుల రుణాలు, చిన్న వ్యాపార రుణాలు, సహకార బ్యాంకుల ద్వారా పొందిన వ్యవస్థాపక రుణాలు వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వడం వాటిని ప్రస్తావించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు చెందిన గ్రామీణ మహిళల జీవనోపాధిని మెరుగుపరచడానికి మేకల పెంపకం ప్రాజెక్టును అమలు చేస్తున్నారని అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అన్ని యూనియన్లలో పథకాల అమలు గురించి పరిశీలించారు.



మేకల పెంపకంపై ఆరా తీస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

మహిళా హాస్టళ్లలో రహస్య కెమెరాలు

● నిరసనతో రంగంలోకి పోలీసులు
● నిందితురాలి అరెస్టు

హోసూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలోని కెలమంగళం సమీపాన నాగమంగళంలో టాటా ఫ్యాక్టరీ ఉంది. ఇక్కడ పనిచేసే మహిళల వసతి కోసం లాలీకల్ ప్రాంతంలో టాటాకర్మాగారం విద్యాల్ రెసిడెన్సీ అనే హాస్టల్ ఉంది. 8 బ్లాక్‌లు 11 అంతస్తులు ఉన్నాయి. 6 వేలకు పైగా ఇక్కడ మహిళలు ఉంటున్నారు. ఇలాంటి తరుణంలో మహిళల బాత్రూంలో రహస్య కెమరాలను అమర్చారని ఆరోపణలు రావడంతో హాస్టల్‌లో ఉంటున్న 2 వేలకు పైగా మహిళలు మంగళవారం రాత్రి ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న హోసూరు సబ్ కలెక్టర్ ఆకృతిశెట్టి, ఎస్పీ తంగదురై సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భద్రతా కోసం 100 మందికి పైగా పోలీసులను మోహరించారు. పోలీసుల దర్యాప్తులో ఒరిస్సాకు చెందిన నీలుకుమారీ గుప్తా(22) బాత్రూంలో రహస్య కెమరాను అమర్చినట్లు వెల్లడైంది. ఉద్దన్నపల్లి పోలీసులు సదరు మహిళను అరెస్టు చేసి ఆమెను విచారించారు. సీసీ కెమెరాల అంశం హాస్టళ్లలో ఉంటున్నవారి తల్లిదండ్రులకు తెలియడంతో వెంటనే ఇతర ప్రాంతాలనుంచి హాస్టల్‌కు చేరుకున్నారు. మరింత ఉద్రిక్త పరిస్థితి నెలకుంది. బుధవారం ఎస్పీ తంగదురై, ఏడీఎస్పీ శంకర్, నేతృత్వంలో డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, పోలీసు అధికారులు సహా 20 మందికిపైగా హాస్టల్ ముందు భద్రతా విధుల్లో పాల్గొన్నారు. అదేవిధంగా సబ్ కలెక్టర్ ఆకృతిశెట్టి, జిల్లా రెవెన్యూ అధికారి ఇతర అధికారులు కూడా మహిళలను విచారిస్తున్నారు. ఈ పరిస్థితిలో హాస్టల్‌లో ఉంటున్న 200 మందికిపైగా మహిళలు తమ తమ లగేజీలతో స్వస్థలాలకు తిరిగి వెళ్లిపోయారు. హాస్టల్‌లో మరెక్కడైనా రహస్య కెమరాలు ఏర్పాటు చేశారా అని 10 బృందాల పోలీసులు ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఏడీఎస్పీ శంకర్ మీడియాతో మాట్లాడుతూ ఒక్కో గదిలో నలుగురు ఉంటున్నారని, 2వ తేది ఆదివారం ఉత్తరాది రాష్ట్రాలనికి చెందిన మహిళలు బస చేస్తున్న గది బాత్రూంలో ఒక చిన్న రహస్య కెమరాను ఏర్పాటు చేసినట్లు గుర్తించామన్నారు. కెమరా అమర్చిన నీలుకుమారి గుప్తా అనే మహిళను అరెస్టు చేశామన్నారు. కెమరా అరమర్చిన 30 నిమిషాల్లోనే విషయం బహిరంగమైందని ఎటువంటి వీడియో రికార్డు కాలేదన్నారు. మరింత దర్యాప్తు సాగుతోందన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నందున సోషల్ మీడియాల్లో తప్పుడు సమాచారాన్ని పోస్టు చేయవద్దని సూచించారు.



హాస్టల్ వద్ద మోహరించిన పోలీసులు